క్లుప్తంగా

అందరి కృషితో ప్రశాంతంగా పోలింగ్



కలెక్టర్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్స్, సెక్టార్ ఆఫీసర్

జగిత్యాల: జిల్లాలో పార్లమెంట్ ఎన్నిక ప్రశాంతంగా నిర్వహించడంతో పాటు, బీర్‌పూర్ కొల్వాయిలో వందశాతం పోలింగ్ కావడం అభినందనీయమని, ఇది అందరి కృషి ఫలితామేనని జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్స్, సెక్టార్ ఆఫీసర్లు కలెక్టర్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాల ప్రిన్సిపాల్స్, సెక్టార్ ఆఫీసర్లు ఎన్నికల్లో ఎంతో కష్టపడ్డారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్, సెక్టార్ ఆఫీసర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు దక్కిన గౌరవం



సదాలక్ష్మిని అభినందిస్తున్న కలెక్టర్

జగిత్యాల: మల్యాల మండలం రామన్నపేట ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలు అనంతల సదాలక్ష్మికి డాక్టరేట్ లభించింది. సామాజిక రంగాల్లో అనేక ఏళ్లుగా అందిస్తున్న సేవలకు ఢిల్లీలోని హోటల్ సరోవర్‌లో సోమవారం వాషింగ్‌టన్ డిజిటల్ యూనివర్సిటీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన అచీవర్స్ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రముఖుల చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషాను కలువగా ఆమెను అభినందించి, సన్మానించారు. మున్ముందు మరిన్ని సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, బోయినిపల్లి ఆనందరావు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం



చెక్కు అందిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

జగిత్యాలక్రైం: పోలీసు శాఖలో పనిచేసి అకాల మరణం పొందిన పోలీసు కుటుంబాలకు అండగా ఉంటామని జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. కొడిమ్యాల పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ గుండెపోటుతో మృతిచెందిన హెడ్‌కానిస్టేబుల్ ఆంజనేయులు కుటుంబానికి కార్పస్ ఫండ్ కింద మంజూరైన రూ.50 వేల చెక్కును మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖలో సేవలందించి అకాల మరణం పొందిన వారి కుటుంబాలకు పోలీసు శాఖ భరోసాగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ సత్యం పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేత



ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రిక ఇస్తున్న నాయకులు

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట రోడ్‌లోని లింగంపేటలో గల పెద్దమ్మతల్లి ఆలయంలో నిర్వహించే బోనాల జాతర కార్యక్రమానికి హాజరు కావాలని మంగళవారం ముదిరాజ్ సంఘం నాయకులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు ఆహ్వానపత్రిక అందజేశారు.

చెరువులు, కుంటల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

మెట్‌పల్లి: రాష్ట్రంలో చెరువులు, కుంటల పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పీసీసీ మత్స్య విభాగం రాష్ట్ర కార్యదర్శి పల్లికొండ ప్రవీణ్ మంగళవారం కోరారు. చాలా చోట్ల చెరువులు, కుంటలకు సంబంధించిన స్థలాలు కబ్జాకు గురయ్యాయని, ఈ విషయాన్ని అధికార యంత్రాంగం దృష్టికి తీసుకపోయినప్పటికీ వారు పట్టించుకోవడం లేదన్నారు. కబ్జాల వల్ల వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారడమే కాకుండా మత్స్యకారుల ఉపాధి దెబ్బతింటుందన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

నిధుల కొరతతో సేవ చేయలేక పోయాం

- బీర్‌పూర్ మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీ సభ్యుల ఆవేదన
- సభ్యులకు అధికారుల సన్మానం



సభ్యులను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

సారంగాపూర్: నిధుల కొరతతో ప్రజలకు ఆశించిన స్థాయిలో సేవ చేయలేకపోయామని బీర్‌పూర్ మండల పరిషత్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీపీ మసర్తి రమేశ్ అధ్యక్షతన మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో సభ్యులు తమ అభిప్రాయాలు వెలిబుచ్చారు. సమావేశానికి జెడ్పీటీసీ పాత పద్మ, వైస్‌ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, ఎంపీటీసీలు రంగు లక్ష్మణ్, ఆడెపు మల్లీశ్వరి, ఎడ్ల సృజన మాట్లాడుతూ ఎంపీటీసీలు గ్రామాల్లో ప్రజల అభిమానంతో గెలిస్తే, తమకు ప్రత్యేకంగా ఎలాంటి నిధులు లేకపోవడంతో ఉత్సవ విగ్రహాలుగా మారిపోయామన్నారు. ప్రభుత్వం ఎంపీటీసీలకు గ్రామపంచాయతీల తరహాలో ప్రత్యేక నిధులు అందించినప్పుడే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎంపీటీసీలకు ప్రత్యేక నిధులు కేటాయించేలా చట్టం చేయాలని కోరారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతు తహసీల్దార్ కార్యాలయంలో భూమి రిజిస్ట్రేషన్‌కు అన్ని డాక్యుమెంట్లతో స్లాట్ బుక్ చేయించుకుంటే రెవెన్యూ కార్యాలయంలో, మరిన్ని పత్రాల పేరుతో రిజిస్ట్రేషన్లు చేయడంలేదన్నారు. కొల్వాయి విండో చైర్మన్ పాల్సాని నవీన్‌రావు మాట్లాడుతూ ఎస్సారెస్పీ కాలువల్లో ఉపాధిహామీ పథకంలో పూడిక తీసే పనులు చేపట్టాలని కోరారు. బీర్‌పూర్ రక్షిత మంచినీటి పథకం పునరుద్ధరణకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రూ.3.70 కోట్లు నిధులు మంజూరు చేయించారని తెలిపారు. రోళ్లవాగు ప్రాజెక్టు నిర్మాణంలో అటవీశాఖకు కేటాయించాల్సిన భూములపై ఈ నెలలో స్పష్టత రానుందని, ప్రాజెక్టుకు గేట్లు బిగించే పనులు కూడా వెంటనే చేపట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఎంపీపీ తెలిపారు. వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ మంగేళ సబ్‌సెంటర్‌లో సిబ్బంది ఉండకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, గృహజ్యోతి పథకంలో జీరో బిల్లు రానివారికి స్పెషల్‌డ్రైవ్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని కోరారు. అనంతరం ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, మండల కోఆప్షన్ సభ్యురాలు ఎండీ.బీబాను మండల పరిషత్ ఉద్యోగులు, ఇతర ప్రజాప్రతినిధులు సన్మానించారు. సమావేశంలో ఎంపీడీవో లచ్చాలు, డెప్యూటి తహసీల్దార్ బొమ్మకంటి శ్రీనివాస్, ఎంపీవో రామకృష్ణరాజు, వ్యవసాయాధికారి అనూష, సూపరింటెండెంట్ రాజమౌళి, ఆయా శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



రామాలయంలో పూజలు చేస్తున్న అడ్లూరి

పెగడపల్లి: రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి మంగళవారం పెగడపల్లి మండలం నంచర్ల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ నంచర్ల పురాతన సీతారామచంద్ర స్వామి ఆలయానికి ఒక ప్రత్యేకత సంతరించుకుందన్నారు. ఆలయ అభివృద్ధితో పాటు గ్రామాభివృద్ధికి కూడా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాములుగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు మల్లారెడ్డి, శ్రీనివాస్, భాస్కర్, తిరుపతి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, సతీశ్‌రెడ్డి, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

గొల్లపల్లి: మండలంలోని చందోలి గ్రామంలో సాయి ఆంజనేయస్వామి ఆలయ 12వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. వేడుకల్లో ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గొల్లపల్లి మండల కేంద్రంలోని శ్రీరామ విద్యా మందిర్, ప్రభుత్వ పాఠశాలలో 1996-97 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు, మల్లాపూర్ మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2000-01లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



దొంతాపూర్‌లో ఉపాధి కూలీలతో బడిబాట ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు

మల్యాల: తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు అన్ని రకాల వసతులు ఉన్నాయని, నాణ్యమైన విద్యాబోధనతోపాటు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాంలు అందజేస్తామని జిల్లా సెక్టోరియల్ అధికారులు కొక్కుల రాజేశ్, కోరుట్ల మహేశ్ అన్నారు.మంగళవారం గొల్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను పరిశీలించారు. పాఠశాలల్లోపనులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ జల పాల్గొన్నారు.

ధర్మపురి: నాణ్యమైన విద్యనందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని ఉపాధ్యాయులు కోరారు. మండలంలోని దొంతాపూర్‌లో మంగళవారం బడిబాటలో భాగంగా 300 మంది ఉపాధిహామీ కూలీలతో గ్రామసభను ఏర్పాటు చేశారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కోరారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఫర్జానా, ప్రధానోపాధ్యాయులు బట్టూరి రాజేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి



బ్యాటింగ్ చేస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

మెట్‌పల్లి: క్రీడలు వ్యక్తుల మధ్య స్నేహభావాన్ని పెంపొందించడానికి దోహదం చేస్తాయని డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు అన్నారు. పట్టణంలోని మినీ స్టేడియంలో ఈ నెల 5 నుంచి జరుగుతున్న ఫొటో, వీడియో గ్రాఫర్ల ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఫైనల్ పోటీలను డీఎస్పీ బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే చదువులతో పాటు క్రీడలపైనే దృష్టి సారించాలన్నారు. కాగా ఫైనల్‌లో విజేతగా నిలిచిన పెగడపల్లి టీంకు ప్రైజ్ మనీ కింద రూ.20వేలు, రన్నరప్‌గా నిలిచిన జగిత్యాల టీంకు రూ.10వేలు అందజేశారు.

రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులు, అధికారులు

ఇబ్రహీంపట్నం: రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని, విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వివరించారు. మంగళవారం మండలకేంద్రంలో రైతు వేదికలో వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా రైతులకు వ్యవసాయ పద్ధతులపై వివరించారు. అధిక సాంద్రత పత్తి పంట సాగులో యాజమాన్య పద్ధతులపై శాస్త్రవేత్త ప్రశాంత్ వివరించారు. ఆదర్శ రైతులతో సేంద్రియ వ్యవసాయం చేస్తు మంచి ఫలితాలు పొందుతున్న పద్మశ్రీ చింతల వెంకట్‌రెడ్డి యొక్క అనుభవాలు, సలహాలు రైతులకు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దీపిక, సింగిల్‌విండో చైర్మన్ బద్దం గోపి, ఏఈవో నరేష్, శ్యామ్‌కుమార్, రవళిక, రైతులు పాల్గొన్నారు.

అధిక సాంద్రత విధానంలో పత్తి సాగుచేయాలి

సారంగాపూర్: అధిక సాంద్రత విధానం (హైడెన్సిటీ సిస్టం) విధానంలో పత్తిని సాగుచేయాలని శాస్త్రవేత్తలు, రైతులకు సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, శాస్త్రవేత్తలు, ఆదర్శరైతులతో రైతులు తమ అనుభవాలను పంచుకుంటూ, వీడియోకాన్ఫరెన్స్‌లో తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏవో తిరుపతినాయక్, ఏఈవో వెంకటేశ్ , రైతులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు డీఎస్పీ నాయకుల వినతి



వినతిపత్రం ఇస్తున్న డీఎస్పీ నాయకులు

కథలాపూర్: ప్రభుత్వ చిహ్నంపై రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఫొటో ఉండేలా చూడాలని కథలాపూర్ తహసీల్దార్‌కు ధర్మ సమాజ్ పార్టీ నాయకులు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వ చిహ్నంను మార్చాలని నిర్ణయించడాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. ప్రభుత్వం దృష్టికి ఈ విషయం తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ నాయకులు రమేశ్, కై లాశ్, రాజేందర్, కోటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ అధ్యక్షుడిగా శివరాత్రి నర్సయ్య

మల్లాపూర్: ఆటో యూనియన్ అధ్యక్షుడిగా శివరాత్రి నర్సయ్యను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా గండికోట చందు కోశాధికారిగా శివరాత్రి శివాజీ, సభ్యులుగా ఎండీ మహమ్మద్ ఖాన్, సాదుల భూమయ్య, రాజం, నరసయ్య ఎన్నికయ్యారు.

వాసవీ సేవాసమితి అధ్యక్షుడిగా కృష్ణ

కోరుట్ల: పట్టణంలోని వాసవీ కన్యక పరమేశ్వరి ప్రథమ వాడకట్టు సంఘం సేవాసమితి అధ్యక్షుడిగా గంగిశెట్టి కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పోలీస్ కళాబృందం అవగాహన

గొల్లపల్లి: సామాజిక రుగ్మతలపై మండలంలోని మల్లన్నపేటలో మంగళవారం పోలీస్ కళాబృందం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, మూఢనమ్మకాలు, రోడ్డు ప్రమాదాలు, డ్రగ్స్, పోలీసు చట్టాల పైన కళారూపాల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై సతీశ్, పోలీసు సిబ్బంది, కళాకారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయికల్: మండలంలోని ఒడ్డెలింగాపూర్ బాలికల మినీ గురుకులంలో ఇంగ్లిష్ మీడియంలో 1వ తరగతిలో 30, 5వ తరగతిలో 10 సీట్లకు ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమ గురుకుల ప్రాంతీయ సమన్వయాధికారి వెంకన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాల కోసం 8333925362, 9502150241 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

మిషన్‌భగీరథపై గ్రామాల్లో సర్వే

సారంగాపూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో మిషన్‌భగీరథ నీటి సరఫరాపై గ్రామపంచాయతీ అధికారులు, ఆశా కార్యకర్తలు సర్వే నిర్వహిస్తున్నారు. మిషన్‌భగీరథ నీరు అందుతుందా లేదా, ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. సారంగాపూర్‌లో జరిగిన సర్వేలో పంచాయతీ కార్యదర్శి ప్రేమలత, ఆశా కార్యకర్తలు మంజుల, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

దుబాయ్‌లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు

కోరుట్ల: స్పార్క్ మీడియా ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఆది, సోమవారాల్లో దుబాయ్‌లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గేయ రచయిత అందె శ్రీ ముఖ్య అతిథిగా హాజరై తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. తెలంగాణ కళాకారులు, ఉద్యమ పాటలతో కార్యక్రమాలు కొనసాగినట్లు స్పార్క్ మీడియా ప్రతినిధులు అరుణ్, రమేశ్, లావణ్య తెలిపారు.

జగిత్యాల వాసికి బాబుజగ్జీవన్‌రామ్ నేషనల్ అవార్డు

జగిత్యాల:జిల్లా కేంద్రానికి చెందిన ఎనుగంటి రాజేశం డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జాతీయ అవార్డు లభించింది. మంగళవారం పూణెలో బహుజన సాహిత్య అకాడమీ నేషనల్ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా అందుకున్నారు. బహుజన సాహిత్య అకాడమీ వారు బాబుజగ్జీవన్‌రామ్ అవార్డు అందించడం గర్వకారణంగా ఉందన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం

కోరుట్ల: ఈనెల 5 పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ పోల్యూషన్ బోర్డు నుంచి కోరుట్ల మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మహేశ్ గ్రీన్ చాంపియన్ అవార్డు అందుకున్నారు. మంగళవారం వీరిని కోరుట్ల మున్సిపల్ సిబ్బంది శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు.

మిత్రుని కుటుంబానికి చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

గొల్లపల్లి: మండలంలోని రాఘవపట్నం గ్రామానికి చెందిన పుట్ట మధు గత నెలలో రోడ్డు ప్రమాదంలో మరణించగా, బాధిత కుటుంబానికి తోటి పదో తరగతి, ఇంటర్ మిత్రులు కలిసి రూ.లక్ష అందజేసి అండగా నిలిచారు. కార్యక్రమంలో మిత్రులు బోడ్ల గంగాధర్, శ్యామ్, సంజీవ్, దినేష్, నరేష్, గంగాధర్, రాజశేఖర్, అనిల్, నవీన్, వేణు తదితరులు పాల్గొన్నారు

అంజనశ్రీకి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

రాయికల్: మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన కూచిపూడి కళాకారిణి దివ్యాంగురాలు బొమ్మకంటి అంజనశ్రీకి మెరుగైన వైద్యం కోసం మంగళవారం రామాజీపేట జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 2003-04లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులందరూ కలిసి రూ.25 వేల ఆర్థికసాయం అందజేశారు.

స్నేహితురాలి కుటుంబానికి..

రాయికల్ మండలం తాట్లవాయి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2007-08లో పదో తరగతి చదివిన వస్తాపూర్ గ్రామానికి చెందిన కల్యాణి భర్త ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, స్నేహితులంతా కలిసి మంగళవారం రూ.27 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వీరిని ఉపాధ్యాయుడు రవీందర్ తదితరులు అభినందించారు.

లాటరీ పద్ధతిన విద్యార్థుల ఎంపిక

జగిత్యాల: జిల్లాలోని బెస్ట్‌అవలేబుల్ స్కూళ్లలో ప్రవేశాలకు లాటరీ పద్ధతిన విద్యార్థులను ఎంపిక చేసినట్లు అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో డ్రా నిర్వహించారు. ఒకటో తరగతిలో నాన్‌రెసిడెన్షియల్‌లో ప్రవేశానికి 119 దరఖాస్తులు వచ్చాయని, సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించని 18 దరఖాస్తులను తిరస్కరించామని, కేటాయించిన 75 సీట్లకు 25 మంది బాలికలు, జనరల్ కేటగిరీలో మిగిలిన వారికి ఎంపిక చేశామని పేర్కొన్నారు. 10మందిని వెయిటింగ్ లిస్టులో ఉంచినట్లు తెలిపారు. 125 దరఖాస్తులు వచ్చాయని, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని రెండు దరఖాస్తులు తిరస్కరించామని, 25మంది బాలికలు, జనరల్ కేటగిరిలో 51మందిని ఎంపిక చేశామని, 10 మందిని వెయిటింగ్ లిస్టులో ఉంచామని షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తెలిపారు.

పిడుగుపడి, కాలిపోయిన గృహోపకరణాలు

కథలాపూర్: భూషణరావుపేటలో సోమవారం రాత్రి పిడుగు పడటంతో పిల్లిగుట్ట ఏరియాలోని పది మంది ఇళ్లలో గృహోపకరణాలు కాలిపోయినట్లు గ్రామస్తులు మంగళవారం తెలిపారు. పెద్ద శబ్దంతో పిడుగు పడటంతో టీవీలు, ఫ్రిజ్‌లు, సీలింగ్ ఫ్యాన్లు, వాషింగ్ మెషిన్లు కాలిపోయాయని బాధితులు రవినాయక్, చిన్న య్య, శంకర్ తదితరులు పేర్కొన్నారు.

యూనిఫామ్స్ అప్పగింత

పెగడపల్లి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందజేయనున్న యూనిఫామ్స్ మంగళవారం ఎంఆర్సీ కార్యాలయానికి చేరాయి. పాఠశాలలు పునఃప్రారంభం రోజే ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, దుస్తులు అందజేయాలని ప్రభుత్వ నిర్ణయించింది. ఈ మేరకు మండలంలోని విద్యార్థులకు సంబంధించిన యూనిఫామ్స్ మండలంలోని వివిధ గ్రామాల స్వశక్తి సంఘాల మహిళా సభ్యులకు కుట్టుకూలీ చెల్లించి కుట్టించారు. 2232 మంది విద్యార్థులకు 1654 మంది విద్యార్థులకి సంబంధించిన దుస్తులు స్వశక్తి సంఘాల మహిళా సభ్యులతో కుట్టించి మంగళవారం ఎంఆర్సీ కార్యాలయ అప్పగించినట్లు ఏపీఎం సమత తెలిపారు.

ట్రాక్టర్ల పట్టివేత

మల్యాల: అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టుకుని, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు. మల్యాల మండలం బల్వంతాపూర్ శివారులో అక్రమంగా మొరం తరలిస్తుండడంతో ఐదు ట్రాక్టర్లను పట్టుకున్నారు. అనుమతి లేకుండా మొరం తరలిస్తున్న డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



వైభవంగా రేణుకా ఎల్లమ్మ బోనాలు

మెట్‌పల్లి: పట్టణంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రేణుకా ఎల్లమ్మ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కులస్తులు బోనాలతో ఊరేగింపుగా శివారులో ఉన్న ఆలయానికి తరలివెళ్లారు. అనంతరం అక్కడ ప్రత్యేక పూజలు చేసి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత వేడుకలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పూదరి సుధాకర్ గౌడ్‌తో పాటు నాయకులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: మండలంలోని పైడిమడుగులో గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఎల్లమ్మకు బోనాలు సమర్పించారు. భక్తులు బోనాలను ఊరేగింపుగా తీసుకవెళ్లి ఎల్లమ్మ తల్లికి నైవేద్యం సమర్పించారు. వేడుకల్లో పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్, తాండ్ర్యాల గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ భూమేశ్వర్ తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నందున ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

మల్యాల: మల్యాల సబ్‌స్టేషన్ 33/11కేవీ పరిధిలోని మల్యాల పట్టణం, గుడిపేట గ్రామం, మల్యాల అడ్డరోడ్డు ప్రాంతంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ దయానంద్ తెలిపారు.

నేడు ఇటిక్యాలలో బీసీ ఆత్మీయ సమ్మేళనం

రాయికల్: మండలంలోని ఇటిక్యాలలో బుధవారం బీసీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు బీసీ సంఘం అధ్యక్షుడు రొట్టెశ్రీధర్ తెలిపారు. జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, బీజేపీ నియోజకవర్గ నాయకురాలు బోగ శ్రావణి , గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్ హాజరు కానున్నట్లు తెలిపారు.